క్లుప్తంగా

ఫ్లెక్సీ, ప్రింటింగ్ నూతన కార్యవర్గం



అసోసియేషన్ నూతన కార్యవర్గం

గజ్వేల్: నియోజకవర్గ ఫ్లెక్సీ, ప్రింటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం గజ్వేల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవసాని హనుమాన్‌దాస్, ప్రధాన కార్యదర్శిగా అనిల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎండీ పాషా, శేఖర్, కోశాధికారిగా శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, వెంకట్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా నవీన్, హరిగౌడ్, సలహాదారులుగా సీహెచ్.నారాయణ, సోషల్ మీడియా బాధ్యులుగా కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా నరేశ్, నర్సింలు, వెంకటేశ్, సునీల్, రేఖను ఎన్నుకున్నారు.

అలయన్స్‌కు అవార్డుల పంట



అవార్డులు తీసుకుంటున్న జిల్లా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్ అంతర్జాతీయ సదస్సులో సిద్దిపేట జిల్లా క్లబ్‌కు 11 అవార్డులు వరించాయని ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మరాములు తెలిపారు. చెన్నైలో జరిగిన సౌత్ మల్టిపుల్ సదస్సులో సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులకు ఈ మేరకు అవార్డులు అందించారని చెప్పారు. అవార్డులు రావడం పట్ల జిల్లా అలయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ గ్రామ హైస్కూలులో 2007–08 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలిచారు. గ్రామానికి చెందిన పిల్లి రాజనర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం మృతుడి భార్య సుజాతకు రూ.21,300 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసానిచ్చారు. ఆపద సమయాల్లో స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థుల ఔదార్యాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.

'నవోదయ'లో సత్తా చాటిన విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రాథమిక పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శ్రీరాముల జయప్రకాష్ నారాయణ ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. కరీంనగర్‌లోని చొప్పదండి నవోదయ విద్యాలయానికి విద్యార్థి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థి, అతడి తండ్రి విజయ్‌ను ఎంఈఓ రంగానాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదనాచారి, వినత, రమాదేవి, సీఆర్పీలు అనురాధ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సౌకర్యాలున్న చోట కళాశాల ఏర్పాటు

హుస్నాబాద్: హుస్నాబాద్‌కు మంజూరైన ఇంజినీరింగ్ కళాశాలను విద్యార్థులకు అనువైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ అనుబంధ కళాశాల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు సౌకర్యం లేని మహాసముద్రం గండి వద్ద కాకుండా సౌకర్యాలు ఉన్న ప్రాంతంలో కళాశాలను నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు సుధాకర్, శంకర్, రాజు ఉన్నారు.

మొక్కల రక్షణకు చలువ పందిళ్లు

- ఎండిపోకుండా నర్సరీల్లో ప్రత్యేక చర్యలు
- నిత్యం మండల అధికారుల పర్యవేక్షణ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎండలు మండుతున్నాయి. వనమహోత్సవంలో భాగంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే చలువ పందిళ్లు (షేడ్ నెట్లు) వేశారు. తద్వారా ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి మొక్కలకు కావాల్సిన సూర్యరశ్మి తగిలి ఏపుగా పెరుగుతాయి.

1.23 లక్షల మొక్కల పెంపకం..

చిన్నకోడూరు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 1.23 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారు. కానీ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మొక్కల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మొక్కలు ఎండిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే కూలీలతో మొక్కలను పెంచడం, నీళ్లు పోయడం లాంటి పనులు చేయిస్తున్నారు.

కార్యదర్శులకు బాధ్యతలు

నర్సరీల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో కార్యదర్శులకు అప్పగించారు. ప్రతి నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఉపాధి హామీ కూలీలతో రోజు నీటిని పట్టించి మొక్కలు ఎండిపోకుండా చూస్తున్నారు. నర్సరీల నిర్వహణపై నిత్యం మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



ఇబ్రహీంనగర్‌లో నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్

మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ

నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో పెంచే ప్రతి మొక్కనూ కాపాడుతున్నాం.

– జనార్దన్, ఎంపీడీఓ

చేర్యాల పీఎస్ పరిధిలో కలపండి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి, శబాష్‌గూడెం, పెదరాజుపేట, వేచరేణి గ్రామాల ప్రజల సమస్య తీర్చాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు గ్రామాల ప్రజలు పోలీస్ స్టేషన్ పనుల నిమిత్తం కొమురవెల్లి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ నాలుగు గ్రామాలను చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో కలపాలని కోరారు.

గజ్వేల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్ : కాంగ్రెస్ 15 నెలల పాలనలో జరిగిన గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి, గత పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రావాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సవాల్ విసిరారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకప్పుడు కరువుకు నిలయంగా, కనీస సౌకర్యాలకు దూరంగా ఉన్న గజ్వేల్‌ను కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, కొమురయ్య, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, రామస్వామి యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల భాగస్వామ్యం కీలకం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రంథాలయ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకమని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సుధీర్ బదిలీపై వెళ్లడంతో వీడ్కోలు, నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వసుంధరకు స్వాగత కార్యక్రమం బుధవారం గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రవీందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, డి.రాజు, రాజు, కనకలక్ష్మి, ముజఫర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ సిబ్బందితో చైర్మన్

కారుణ్య నియామకం

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ సలీముద్దీన్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుమారుడికి కారుణ్య నియామకాల్లో భాగంగా బుధవారం ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతల వారీగా కారుణ్య నియామకాల్లో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పీఆర్ఓ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉద్యోగ పత్రాన్ని అందజేస్తున్న సీపీ

ఆలయ అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



పనులు ప్రారంభిస్తున్న వెంకటయ్య

దుబ్బాక: దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన కూడవెల్లి రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం అక్బర్‌పేట - భూంపల్లి మండలంలోని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాసం, అక్బర్‌పేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రవి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీ సహకారంతో ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్

గజ్వేల్‌రూరల్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న అంబులెన్స్‌కు బుధవారం పూజలు నిర్వహించినట్లు బీజేపీ నాయకులు జశ్వంత్‌రెడ్డి, బండారు మహేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, బీజేపీ నాయకులు రాంరెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, వెంకట్‌గౌడ్, అరవింద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు క్యూరింగ్‌కు చర్యలు

సాక్షి ఎఫెక్టు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో ఈజీఎస్ పథకంలో నిర్మించిన సీసీ రోడ్డుపై క్యూరింగ్ కోసం నీరు పోసే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. గ్రామంలో వారం రోజుల కిందట రూ. 5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనిలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డుపై పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఈనెల 24న పనుల హడావుడి.. నాణ్యత కొరవడి అనే పరిశీలనాత్మకమైన కథనం సాక్షిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సీసీ రోడ్డుపై కట్టలు కట్టించి ట్యాంకరుతో నీటిని పోయించి నీరు నిలిచేలా చర్యలు చేపట్టారు. నాణ్యత లోపాలను ఎత్తి చూపుతూ కథనాన్ని ప్రచురితం చేసిన సాక్షి దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



క్యూరింగ్ కోసం నీటితో నింపిన దృశ్యం

బెల్లంకుంటకు నీరు రాకుండా కుట్రలు





నిరసన తెలుపుతున్న రైతులు, కాలువలో ఇసుక సంచులు, బండరాళ్లు వేసిన దృశ్యం

నిరసన తెలిపిన రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ నుంచి కాలువ ద్వారా బెల్లంకుంటకు గోదావరి నీళ్లు రాకుండా కుట్రలు చేస్తున్నారని రైతులు తెలిపారు. నీళ్లు వస్తున్నాయని ఎంతో సంతోషపడ్డామని, కానీ మంగళవారం రాత్రి దుండగులు కాలువలో ఇసుక సంచులు వేసి నీటిని అడ్డుకున్నారని చిన్నకోడూరు రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల శివారులోని బెల్లంకుంట సమీపంలో పంటలు ఎండిపోతుంటే ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్యే హరీష్‌రావుకు మొరపెట్టుకున్నారు. ఆయన స్పందించి ఇటీవలే రంగనాయక సాగర్ నుంచి బెల్లంకుంటకు కాలువ తవ్వించడానికి చొరవ చూపారు. నీళ్లు వస్తున్న క్రమంలో కొందరు దుండగులు కాలువలో ఇసుక సంచులు, బండ రాళ్లు వేసి అడ్డుకుంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకొని తమ పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు.

ఆయిల్‌పామ్‌లో సస్యరక్షణ చర్యలు

- పరిశీలించిన ఏఈవో నాగార్జున
- యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

తొగుట(దుబ్బాక): ఆయిల్‌పామ్ తోటలకు వేసవిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో నాగార్జున రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతులు సాగుచేసిన తోటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలను సంరక్షించుకునేందుకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముఖ్యంగా నీటి యాజమాన్యంపై దృష్టి పెట్టాలన్నారు. మొవ్వ దగ్గర ఉన్నమట్టలు రెండుకంటే ఎక్కువ విచ్చుకోకపోతే ఆ మొక్క నీటి ఎద్దడికి గురైనట్టు గుర్తించాలని, వెంటనే నీటిని అందించాలన్నారు. వేసవిలో మూడు నుంచి నాలుగు ఏళ్ల వయసు గల మొక్కలకు రోజుకు సుమారు 300 లీటర్ల నీళ్లు అవసరమవుతాయని చెప్పారు. సాధారణంగా బిందు సేద్యం ద్వారా గంటకు 80లీటర్ల నీటిని విడుదల చేస్తుందని, ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున నీటిని అందించాలని సూచించారు. నీటిని అందించే సమయంలో మొక్క మొదలు నుంచి ఒక మీటరు మొదలుకొని మూడు మీటర్ల వ్యాసార్థంలో నీటిని అందించాలని తెలిపారు. నేలలో ఉన్న నీరు ఆవిరి కాకుండా ఉండటానికి పాదులలో మల్చింగ్ ఏర్పాటు చేసుకోవాలని రైతులను కోరారు. పాదు ఒక మీటర్ వ్యాసార్థం వరకు ఏర్పాటు చేసుకొని వరిగడ్డితో కప్పి ఉంచుకోవాలని, లేదా జనుము, జీలుగ చల్లుకొని ఏపుగా పెరిగిన తర్వాత కోసి అదే పాదులో కప్పుకోవాలని సూచించారు. ఎరువులు వేసే సమయంలో తేమ ఎక్కడైతే ఉంటుందో అక్కడ వేసుకుంటే త్వరగా కరిగి మొక్కకు పోషకాలు అందుతాయని ఆయన రైతులకు సూచించారు.



ఆయిల్ పామ్ తోట పరిశీలించిన ఏఈవో నాగార్జున

సంక్షిప్త వార్తలు

◆ మోహన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

హుస్నాబాద్: ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేసిన అయిలేని మోహన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మోహన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మోహన్ రెడ్డి 25 ఏళ్ల పాటు ప్రజా సేవకు అంకితమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి కుమారుడు మల్లిఖార్జున్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, వివిధ పార్టీల నాయకులు రమణా రెడ్డి, శంకర్ రెడ్డి, రాంచంద్రం, వెంకటస్వామి, థామస్, భుక్యరాజు నాయక్ పాల్గొన్నారు.

◆ కేజీబీవీకి ఖోఖో పోల్స్ అందజేత

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులకు క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ ఖోఖో పోల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారుల అభ్యున్నతి కోసం తమవంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, నవీన్, నరేశ్ కుమార్, కేజీబీవీ పీఈటీ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పాడి అభివృద్ధికి కృషి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాడి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పీర్లపల్లి గ్రామంలో గజ్వేల్‌మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, మందులు పంపిణీ, గాలికుంటు, చర్మవ్యాధి టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శ్వేత తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, వీటీ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు హరినాథ్, నర్సింహా రెడ్డి, రాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

◆ అర్హులకే ప్రభుత్వ పథకాలు

దౌల్తాబాద్ (దుబ్బాక): అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ అన్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 11 మంది వికలాంగ లబ్ధిదారులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సీడీపీఓ, ఐకేపీ ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతిభ గుర్తించేందుకే వ్యాసరచన పోటీలు



మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు ఎంతో దోహదం చేస్తాయని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని రేబర్తి గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాకీ చంద్రభాను ,తదితరులు పాల్గొన్నారు.

◆ ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్: ఆస్తి పన్నుల బకాయిలు పూర్తిగా చెల్లించే వారికి ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్)కు అనుమతి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. ఆర్థిక సంవత్సరం 2024–2025 వరకు ఉన్న ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించే వారికి 90 శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందని తెలిపారు. బకాయిలను 10 శాతం వడ్డీతో ఈ నెల 31లోగా చెల్లించాలని సూచించారు. ఇంతక ముందే చెల్లించిన వారికి అడ్వాన్స్ రూపంలో రానున్న ఆర్థిక సంవత్సరానికి జమ చేయబడుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

◆ శ్మశానవాటిక ఆక్రమణను అడ్డుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో ముస్లిం శ్మశానవాటిక స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ముస్లింలు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. మా తాతల నాటి నుంచి ఉందని, సమీపంలోని కొందరు ఆక్రమిస్తున్నారని మజీద్ కమిటీ అధ్యక్షుడు సుకూర్‌మియా ఆరోపించారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఆక్రమణలను తొలగించాలని కోరారు. వీరి వెంట రహిమొద్దీన్, కరీంసాబు, పకీర్, రజాక్ తదితరులు ఉన్నారు.

◆ అక్రమ ఇసుక డంప్ సీజ్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లిలో బుధవారం పలు చోట్ల దాడులు నిర్వహించి అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ వాహనదారులు నిబంధనలు పాటించాలి

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం .. పట్టణంలో సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 6మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.8వేల జరిమానా విధించారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కాశగుడిసెలు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మాజీ సర్పంచ్ షేక్ పకీర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ షరీఫ్, మాజీ ఉపసర్పంచ్ చాంద్ బి, నాయకులు షేక్ హుస్సేన్, సుభాన్, ఇమామ్, దావూద్, మహబూబ్, షరీఫ్, మదర్, హజ్రత్ పాల్గొన్నారు.

◆ ఆర్‌వీవీకి దరఖాస్తు చేసుకోండి

బెజ్జంకి(సిద్దిపేట): రాజీవ్ యువ వికాసం పథకానికి ఆసక్తి గల యువకులు ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కడవెర్గు ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవా కేంద్రాల్లో చేసుకున్న దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మే 20 తేదీ వరకు మండల స్థాయిలో, 31వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

◆ వారాంతపు సంత వేలం వాయిదా

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ప్రతి సోమవారం నిర్వహించే కూరగాయలు, పశువుల సంతల వేలం పాటలను బుధవారం ఎంపీడీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన పశువుల అంగడికి 2.32 లక్షలు, కూరగాయల సంతకు 4.05 లక్షలు వేలంలో రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీఓ మంజుల తెలిపారు. త్వరలోనే మళ్లీ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

◆ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ బైక్ ర్యాలీ

హుస్నాబాద్: ఇంజినీరింగ్ కళాశాల మంజూరైన సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు పొన్నం అనూప్ గౌడ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఇంటిగ్రేటెడ్ స్కూల్, 250 పడకల ఆస్పత్రి, రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చడానికి కోట్ల రూపాయలు వెచ్చించారని తెలిపారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

దౌల్తాబాద్ (దుబ్బాక): ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు కాల్ చేస్తే బ్యాంకు వివరాలు చెప్పవద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విక్రమ్, కానిస్టేబుల్ శివ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ నవోదయలో విద్యార్థుల ప్రతిభ



వర్గల్(గజ్వేల్): నవోదయ ప్రవేశ పరీక్షలో వర్గల్ మండలం నెంటూరు విశ్వశాంతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన ఎలగందుల శ్రీనిత, ర్యాకల స్నికితను ప్రిన్సిపాల్ దేవి దయాకర్, ఉపాధ్యా యులు అభినందించారు.